నిరుద్యోగ భృతి ఇస్తే ఆసరాగా ఉంటుంది



నేను డిగ్రీ పూర్తి చేశా. ఉద్యోగ ప్రయత్నాల్లో ఉన్నా. కోచింగ్ తీసుకోవాలంటే వేల రూపాయల్లో ఖర్చవుతోంది. సరైన కోచింగ్ సెంటర్ల కోసం సుదూర ప్రాంతాలకు వెళ్లాలి. కోచింగ్ ఖర్చుతో పాటు వసతి ఖర్చులు కూడా పెరుగుతున్నాయి. దీంతో అడుగు ముందుకు వేయలేని పరిస్థితి. ఈ నేపథ్యంలో ప్రభుత్వం నిరుద్యోగ భృతి కింద నెలకు రూ.3 వేలు ఇస్తే ఎంతో ఆసరాగా ఉంటుంది. కూటమి ప్రభుత్వం వచ్చి రెండు నెలలు కావస్తుండటంతో వెంటనే పథకం అమలుకు చర్యలు చేపట్టాలి.

– ఎర్రిబోయిన ఏడుకొండలు, నిరుద్యోగి

ప్రతి నెలా రూ.1,500 ఇవ్వాల్సిందే



ప్రతి ఆడబిడ్డకు ప్రతి నెలా రూ.1,500 పంపిణీ చేస్తామని ఎన్నికల సమయంలో కూటమి పార్టీ నేతలు హామీ ఇచ్చారు. అధికారంలోకి రాగానే ఇస్తామన్నారు. జూన్‌లో ప్రభుత్వం ఏర్పాటైంది. ప్రస్తుతం సెప్టెంబర్ నెల కూడా ముగుస్తోంది. ఇప్పటికీ ఈ పథకాన్ని ప్రారంభించలేదు. వెంటనే పథకాన్ని అమలు చేసి గడిచిన నాలుగు నెలల బకాయిలు కూడా కలిపి ఇవ్వాలి.

– నాటూరు సుబ్బరత్తమ్మ, ఒంగోలు

ఉచిత బస్సు ప్రయాణం కోసం ఎదురుచూస్తున్నాం



ఏదైనా ప్రయాణం చేయాల్సి వచ్చి బస్సు ఎక్కాలంటే చార్జీల మోత మోగుతోంది. అందువలన అవసరమైన ప్రయాణాలు కూడా మానుకుంటున్నాం. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే మహిళలకు ఉచిత బస్సు ప్రయాణమన్నారు. నమ్మి ఓట్లేసి ప్రజలు గెలిపించారు. నాలుగు నెలలు కావడంతో ఉచిత బస్సు ప్రయాణం కోసం ఆశగా ఎదురుచూస్తున్నాం. వెంటనే అమలు చేస్తే ఎంతో ఉపయోగంగా ఉంటుంది.

– గుమ్మడి నాగలక్ష్మి

తక్షణమే రైతులకు రూ.20 వేలు అందించాలి



గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ప్రతి ఏటా రైతులకు వైఎస్సార్ రైతు భరోసా కింద రూ.13,500 అందించింది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వస్తే అన్నదాత సుఖీభవ కింద రైతులకు ఏటా రూ.20 వేలు ఇస్తామని చెప్పారు. ఆశపడి ఓట్లేసి గెలిపించాం. ప్రస్తుతం ఖరీఫ్ ముగుస్తోంది. కానీ, రూపాయి కూడా విడుదల చేయలేదు. తక్షణమే ప్రభుత్వం రైతులకు నిధులు విడుదల చేయాలి.

– బొడ్డు శ్రీకాంత్, రైతు

పాఠశాలల ప్రారంభంలోనే తల్లికి వందనం ఇవ్వాల్సింది



నాకు ఇద్దరు పిల్లలు. గత ప్రభుత్వంలో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాఠశాలలు ప్రారంభం కాగానే అమ్మ ఒడి పథకం నగదు అందించడంతో ఎంతో ఉపయోగంగా ఉండేది. ఆ నగదుతో పిల్లలకు కావాల్సినవన్నీ కొనుగోలు చేసుకునేవాళ్లం. గత ఎన్నికల ముందు చంద్రబాబు తమ ప్రభుత్వం వస్తే పిల్లలందరికీ ఏటా రూ.15 వేలు ఇస్తామన్నారు. కానీ, ప్రభుత్వం వచ్చి, పాఠశాలలు తెరిచి నాలుగు నెలలైనా ఇంతవరకూ ఇవ్వలేదు. వెంటనే తల్లికి వందనం పథకాన్ని ప్రారంభించాలి.

– పోట్లూరి రమ్య, అన్నంగి

బాబు బడా మోసం



- సూపర్ 6 పథకాల పేరుతో ప్రజలను మోసం చేసిన సీఎం చంద్రబాబు
- అధికారంలోకి రాగానే అమలు చేస్తామని ఎన్నికల వేళ ఊకదంపుడు ఉపన్యాసాలు
- నేటికీ అమలు చేయకపోవడంపై ప్రజల్లో అసంతృప్తి
- ఇప్పట్లో అమలు చేయలేమంటూ మాట్లాడటంపై నిరసన వెల్లువ

సాక్షి నెట్‌వర్క్: సూపర్ 6 అన్నారు.. అధికారం ఇవ్వమన్నారు.. కూటమి ప్రభుత్వం ఏర్పాటైన వెంటనే ఆరు పథకాలు అమలు చేసి ప్రజలకు భారీగా ఆర్థిక లబ్ధి చేకూరుస్తామన్నారు.. నమ్మి ఓట్లేసిన ప్రజలను ఇప్పుడు నట్టేట ముంచారు. ఈ ఏడాది ఇవ్వలేమని, వచ్చే ఏడాది నుంచి అమలు చేస్తామని నారా లోకేష్ అంటుంటే.. సూపర్ 6పై ముందుకు వెళ్లాలంటేనే భయమేస్తోందని సీఎం చంద్రబాబు ఏకంగా అసెంబ్లీలోనే చెప్పడంపై ప్రజలు తీవ్ర అసహనం వ్యక్తం చేస్తున్నారు. ఇవన్నీ చూస్తుంటే.. సూపర్ 6కు ఎగనామం పెడుతున్నారనే విషయాన్ని చెప్పకనే చెబుతున్నారంటూ జనం విమర్శిస్తున్నారు. కేవలం ఎన్నికల్లో గెలిచేందుకే ప్రచార కార్యక్రమాల్లో ఊకదంపుడు ఉపన్యాసాలు చేశారే తప్ప.. ఇప్పట్లో సూపర్ 6 పథకాలు అమలు చేసే ఉద్దేశం కూటమి ప్రభుత్వానికి లేదని, చంద్రబాబును నమ్మి మరోసారి నిలువునా మోసపోయామని ప్రజలు చర్చించుకుంటున్నారు. గత ఐదేళ్లుగా వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో సీఎంగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వలంటీర్లు, సచివాలయ వ్యవస్థల ద్వారా ఇంటి వద్దకే అందించిన సంక్షేమ పథకాలను గుర్తుచేసుకుంటున్నారు.

జగన్ పాలనలో ఒక్కో ఏడాదికి తల్లికి అందిన సాయం

పథకం	నియోజకవర్గం	లబ్ధి(రూ.కోట్లలో)
అమ్మఒడి	ఒంగోలు	రూ.9.92
	సంతనూతలపాడు	రూ.29.67

టీడీపీ పాలనలో ఒక్కో ఏడాదికి తల్లికి అందాల్సిన సాయం

నియోజకవర్గాల వారీగా లబ్ధిదారులు

ఒంగోలు	-	10 వేల మంది
సంతనూతలపాడు	-	39,785 మంది
ఇవ్వాల్సిన సాయం	-	రూ. 74.67 (కోట్లు)



జగన్ పాలనలో ఒక్కో ఏడాదికి రైతులకు అందిన సాయం



పథకం	నియోజకవర్గం	లబ్ధి(రూ.కోట్లలో)
రైతు భరోసా	ఒంగోలు	రూ. 14.20
	సంతనూతలపాడు	రూ. 40.93

టీడీపీ పాలనలో ఒక్కో ఏడాదికి రైతులకు అందాల్సిన సాయం

నియోజకవర్గాల వారీగా లబ్ధిదారులు

ఒంగోలు	-	10,517
సంతనూతలపాడు	-	30,323
ఇవ్వాల్సిన సాయం	-	రూ. 81.67 (కోట్లు)






యువతకు నెలకు రూ.3000 నిరుద్యోగ భృతి

నియోజకవర్గం వారీగా లబ్ధిదారులు

ఒంగోలు నియోజకవర్గం : సుమారు లక్ష మంది
సంతనూతలపాడు : 15,000 మంది
ఏడాదికి ఇవ్వవలసిన సాయం : రూ.414 కోట్లు



ప్రతి మహిళకు నెలకు రూ.1500

నియోజకవర్గం వారీగా లబ్ధిదారులు

ఒంగోలు నియోజకవర్గం : 70 వేల మంది
సంతనూతలపాడు : 40 వేల మంది
ఏడాదికి ఇవ్వవలసిన సాయం : రూ.198 కోట్లు

నా ఇద్దరు పిల్లలకూ కలిపి రూ.30 వేలు ఇవ్వాలి



నాకు ఇద్దరు పిల్లలు. రెక్కల కష్టంమీదనే ఇద్దరినీ చదివించుకుంటున్నాం. ఒకరు ప్రభుత్వ బడికి, మరొకరు ప్రైవేటు బడికి వెళ్తున్నారు. ఇద్దరినీ ప్రైవేటు స్కూళ్లలో చదివించుకోవాలంటే కష్టంగా ఉంది. కూటమి ప్రభుత్వం హామీ ఇచ్చిన విధంగా ఇద్దరు పిల్లలకూ ఒక్కొక్కరికి రూ.15 వేల చొప్పున మొత్తం రూ.30 వేలను తల్లికి వందనం పథకం ద్వారా అందించాలి. గతంలో స్కూళ్లు తెరవగానే అమ్మ ఒడి పథకం నగదు జమయ్యేవి. ఇప్పుడు ఇద్దరికీ ఇస్తామన్నారుగానీ.. ఒక్కరికి కూడా ఇవ్వలేదు. తక్షణమే తల్లికి వందనం నిధులు విడుదల చేయాలి.

– పురిణి వెంకటేశ్వరమ్మ, తల్లి

నిరుద్యోగ భృతి హామీ నిలబెట్టుకోవాలి



ఎన్నికల సమయంలో సూపర్ సిక్స్ హామీల్లో భాగంగా ఇంటికో ఉద్యోగం లేదా అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ నిరుద్యోగ భృతి కింద రూ.3 వేలు అందిస్తామన్నారు. ఆ హామీ మేరకు సీఎం చంద్రబాబు త్వరగా ఉద్యోగాల కల్పన చేపట్టాలి. లేదా వెంటనే నిరుద్యోగ భృతి కింద నెలకు రూ.3 వేలను అర్హులందరికీ అందించాలి.

– పఠాన్ ఇమ్రాన్, అమ్మనబ్రోలు

ఉచిత గ్యాస్ సిలిండర్లు ఏవి.?



అర్హత ఉన్న ప్రతి మహిళకు ఏడాదికి ఉచితంగా 3 గ్యాస్ సిలిండర్లు ఇస్తామని కూటమి పార్టీల నాయకులు ఓట్లు వేయించుకుని గెలిచారు. కూటమి ప్రభుత్వం ఏర్పాటై నాలుగు నెలలు కావస్తోంది. వెంటనే ఉచిత సిలిండర్ల హామీ నిలబెట్టుకోవాలి. ఉచిత సిలిండర్లు ఇవ్వలేమని మంత్రి నాదెండ్ల మనోహర్ అసెంబ్లీలో మాట్లాడటం చాలా బాధాకరం. ఓట్లు వేసిన ప్రజలను మోసం చేయకుండా పథకాలన్నీ ప్రారంభించి పక్కాగా కొనసాగించాలి.

– అనూష, గృహిణి, చదలవాడ

పంటల సాగుకు సాయం చేయాలి



గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ఖరీఫ్ ప్రారంభంలోనే రైతులు పంటలు సాగుచేసుకునేందుకు రైతు భరోసా పథకం ద్వారా రూ.13,500 నగదును బ్యాంకు ఖాతాల్లో జమ చేసేది. కూటమి ప్రభుత్వం కూడా ఎన్నికల హామీల్లో రైతులకు అందిస్తామన్న రూ.20 వేల సాయాన్ని త్వరగా అందిస్తే బయట అప్పులు చేయకుండా పంటలు పండించుకునేందుకు వీలుగా ఉంటుంది.

– కుక్కల అంజిరెడ్డి, కాపువారిపాలెం, కనపర్తి

సూపర్ 6పై మాట మార్చడం సబబు కాదు



రైతుకు ఏటా రూ.20 వేలు ఇస్తామని చంద్రబాబు చెప్పిన మాటకు కట్టుబడి ఉండాలి. అలాకాకుండా అసెంబ్లీలో సీఎం మాట్లాడుతూ సూపర్ సిక్స్ పథకాలపై ముందుకు వెళ్లాలంటే భయంగా ఉందనడం హాస్యాస్పదం. సంపద సృష్టించి పథకాలు అమలు చేస్తానని ఎన్నికల వేళ చంద్రబాబు చెప్పారు. ఆ మేరకు సూపర్ 6 పథకాలపై మాట మార్చకుండా అన్నీ అమలు చేయాలి. గతం ప్రభుత్వంలో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఖరీఫ్ మొదలవగానే రైతు భరోసా నిధులు జమ చేశారు.

– కంది పున్నారెడ్డి, నేలటూరు, మద్దిపాడు మండలం

రేపు స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ సెలక్షన్స్



మద్దిపాడులో సమావేశమైన పీడీలతో హెచ్‌ఎం కోటిరెడ్డి

మద్దిపాడు: మద్దిపాడు కడియాల యానాదయ్య ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో మండల స్థాయి ఎంపిక పోటీలను ఈ నెల 20వ తేదీ నిర్వహించనున్నట్లు మండల కో ఆర్డినేటర్ పాపారావు తెలిపారు. మద్దిపాడు కేవై ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో బుధవారం పీడీలు, హెచ్‌ఎంలతో సమావేశం నిర్వహించి మాట్లాడారు. బాలబాలికలకు కబడ్డీ, ఖోఖో, వాలీబాల్, షటిల్ బ్యాడ్మింటన్, యోగా ఎంపిక పోటీలు నిర్వహించనున్నట్లు తెలిపారు. మండలంలోని 7 ఉన్నత పాఠశాలలతో పాటు ప్రైవేటు పాఠశాలల విద్యార్థులు కూడా పాల్గొనవచ్చన్నారు. అండర్-14, అండర్-17 విభాగాలలో టీములు ఏర్పాటు చేస్తామని చెప్పారు. పీడీలు మాధవీలత, భువన, రాజ్యలక్ష్మి, సురేంద్ర సౌజన్య, అంకయ్య పాల్గొన్నారు.

నాగులుప్పలపాడు మండలంలో 21న...

నాగులుప్పలపాడు: మండల స్థాయిలో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆటల పోటీలకు క్రీడాకారుల ఎంపికను ఈ నెల 21వ తేదీ బీ నిడమానూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో నిర్వహించనున్నట్లు మండల కో ఆర్డినేటర్ వేణుగోపాలరావు తెలిపారు. యోగా, చెస్, కబడ్డీ, ఖోఖో, వాలీబాల్, బ్యాడ్మింటన్‌లో అండర్-14, 17 విభాగాలలో ఎంపిక పోటీలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల విద్యార్థులు పాల్గొనాలని సూచించారు. అండర్-14కు 2011 జనవరి తర్వాత, అండర్-17కు 2008 జనవరి 1 తర్వాత జన్మించిన విద్యార్థులు అర్హులని వివరించారు. జనన ధ్రువీకరణ పత్రాలు, ఫొటోలు, హెడ్‌మాస్టర్ అటెస్టు చేసిన పత్రాలు తీసుకుని ఆర్గనైజర్ గద్దం వెంకట్రావును కలవాలని విద్యార్థులకు సూచించారు.

చదలవాడ పశుక్షేత్రానికి రూ.6.52 లక్షల ఆదాయం




వేలంపాట నిర్వహిస్తున్న అధికారులు

నాగులుప్పలపాడు: మండలంలోని చదలవాడ పశుక్షేత్రంలో బుధవారం నిర్వహించిన ఒంగోలు జాతి పశువుల వేలంలో ప్రభుత్వానికి ఆదాయం వచ్చినట్లు డీడీ రవికుమార్ తెలిపారు. ఒంగోలు జాతి 66 పశువులకు బుధవారం వేలంపాట నిర్వహించగా 56 మంది రైతులు పాల్గొని మొత్తం 50 పశువులను కొనుగోలు చేసినట్లు తెలిపారు. దీని ద్వారా ప్రభుత్వానికి రూ. 6.52 లక్షల ఆదాయం వచ్చినట్లు తెలిపారు. వేలంలో ఏపీఎల్‌డీఏ డాక్టర్ గౌతమ్‌కుమార్, డీఎల్‌డీఏ చైర్మన్ డాక్టర్ రమేష్, డీడీ రవి, ఏడీఏ డాక్టర్ నాగభూషణరావు, సిబ్బంది పాల్గొన్నారు.

నేత్రపర్వంగా వీరబ్రహ్మేంద్ర స్వామి కళ్యాణం

ఒంగోలు మెట్రో: స్థానిక కొప్పోలు తూర్పుబజారులో ఉన్న బ్రహ్మంగారి మఠ ప్రాంగణంలో సింగమనేని వెంకటేశ్వర్లు పంచాక్షరి దంపతుల ఆధ్వర్యంలో బుధవారం ఉదయం శ్రీ గోవిందమాంబ వీరబ్రహ్మేంద్రస్వామి కళ్యాణ మహోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. వేద పురోహితులు బ్రహ్మశ్రీ ఇంకొల్లు మధుసూదనాచార్య ఎనిమిది మంది దంపతులచే వేదమంత్రాల మధ్య కళ్యాణం జరిపించారు. పాల్గొన్న భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.




గోవిందమాంబ వీరబ్రహ్మేంద్రస్వామి కళ్యాణం జరిపిస్తున్న వేద పురోహితులు, దంపతులు

సంక్షిప్తంగా

నులిపురుగుల నివారణ మాత్రల పంపిణీ

ఒంగోలు: స్థానిక డీఎస్ ప్రభుత్వ మహిళా డిగ్రీ కాలేజీలో బుధవారం నులిపురుగుల నివారణ మాత్రలు పంపిణీ చేశారు. ప్రిన్సిపాల్ డాక్టర్ డి.కళ్యాణి మాట్లాడుతూ విద్యార్థినులంతా వ్యక్తిగత శుభ్రత పాటించాలని, కలుషిత ఆహార పదార్థాల జోలికి వెళ్లరాదని సూచించారు. జంతుశాస్త్ర అధ్యాపకురాలు వి.శ్రీలక్ష్మి మాట్లాడుతూ నులిపురుగులు శరీరంలోకి ప్రవేశించే విధానం, ప్రవేశించిన తర్వాత కనిపించే లక్షణాల గురించి వివరించారు. ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్లు సుధారాణి, సీహెచ్ శ్రీనివాసరావు ఆల్బెండజోల్ మాత్రలను విద్యార్థినులకు పంపిణీ చేశారు.

జాతీయస్థాయి ఖోఖో పోటీలకు ఎంపిక



జాతీయస్థాయి పోటీలకు ఎంపికైన వైశాలితో హెచ్‌ఎం, పీడీలు

చీమకుర్తి(మద్దిపాడు): జాతీయస్థాయి ఖోఖో పోటీలకు సంతనూతలపాడు జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో చదువుతున్న 9వ తరగతి విద్యార్థిని ఎ వైశాలి ఎంపికైనట్లు ప్రధానోపాధ్యాయురాలు ఉమామహేశ్వరి తెలిపారు. ఈ నెల 15న పంగులూరులోని జూనియర్ కళాశాల ఆవరణలో జరిగిన అండర్ -14 రాష్ట్రస్థాయి పోటీల్లో సంతనూతలపాడు పాఠశాల విద్యార్థిని ఎ వైశాలి ప్రతిభ కనబరిచి జాతీయస్థాయి పోటీలకు ఎంపికైనట్లు పీడీ శ్రీనివాసరెడ్డి తెలిపారు. వైశాలి ఈ నెల 28 నుంచి జార్ఖండ్ రాష్ట్రం రాంచీలో జరిగే జాతీయస్థాయి సబ్ జూనియర్ పోటీల్లో పాల్గొననుంది. జాతీయస్థాయి పోటీలకు ఎంపికైన వైశాలిని ఉపాధ్యాయులు అభినందించారు.

విద్యార్థినికి ఆర్థికసాయం

నాగులుప్పలపాడు: నీట్ ప్రవేశాలలో ప్రతిభ చూపి గుంటూరు మెడికల్ కళాశాలలో ఎంబీబీఎస్ సీటు సాధించిన మండలంలోని ఉప్పుగుండూరు గ్రామానికి చెందిన మున్నంగి సుమకు ఆ గ్రామానికి చెందిన కొంజేటి సురేష్ బుధవారం ఆర్థికసాయం అందజేశారు. సురేష్‌ను సామాజిక వేత్త తెలగతోటి శ్యామ్యూల్ అభినందించారు.

ఒంగోలులో బౌద్ధారామం నిర్మాణానికి సన్నాహాలు

ఒంగోలు టౌన్: దేశానికి గౌరవం పెంచిన బుద్ధుని పేరుతో జిల్లా కేంద్రమైన ఒంగోలులో బౌద్ధారామం నిర్మించడానికి సన్నాహాలు చేస్తున్నట్లు బుద్ధిస్ట్ సొసైటీ ఆఫ్ ఇండియా జాతీయ సభ్యుడు ఎండ్లూరి నాగేశ్వరరావు తెలిపారు. బుధవారం నగరంలోని బీసీ సంక్షేమ సంఘ కార్యాలయంలో బౌద్ధులు, బౌద్ధాభిమానుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాజకీయాలకు అతీతంగా నిర్మించే బౌద్ధారామానికి ప్రభుత్వం స్థలం కేటాయించాలని విజ్ఞప్తి చేశారు. జిల్లాలో బౌద్ధుల సంఖ్య క్రమంగా పెరుగుతోందని సమావేశానికి అధ్యక్షత వహించిన డాక్టర్ సుధాకర్‌బాబు తెలిపారు. సమావేశంలో ధమ్మచక్ర ఫౌండేషన్ వ్యవస్థాపకుడు గాండ్ల హరిప్రసాదరావు, మాజీ సైనికుడు సుదర్శి మోహనరావు, బీఎస్‌ఐ జిల్లా కమిటీ అధ్యక్షుడు ఎ.మహేష్ నాగ, విశ్రాంత ప్రొఫెసర్ దారా సుబ్బారావు, సీహెచ్ సుధీర్‌బాబు, జి.నాగేశ్వరరావు, లక్ష్మీప్రసాదరావు, పాలేటి రవీంద్ర, ఆనందసాయి, లక్ష్మణ్, రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

ఆస్టర్ రమేష్ హాస్పిటల్లో అత్యాధునిక వైద్యం



వివరాలు వెల్లడిస్తున్న వైద్యులు

ఒంగోలు టౌన్: స్థానిక ఆస్టర్ రమేష్ హాస్పిటల్లో జీర్ణకోశ వ్యాధితో బాధపడుతున్న 65 ఏళ్ల రోగికి అత్యాధునిక పార్టో వైద్య చికిత్స చేశారు. బుధవారం వైద్యశాలలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ప్రముఖ ఇంటర్వెంటనల్ రేడియాలజిస్ట్ డాక్టర్ తేజ చామల ఆ వివరాలు వెల్లడించారు. కంభం గ్రామానికి చెందిన 65 ఏళ్ల వ్యక్తి కొన్నాళ్ల నుంచి రక్తపు వాంతులతో ఇబ్బంది పడుతూ హాస్పిటల్‌కు రాగా, జీర్ణకోశ వైద్య నిపుణురాలు డాక్టర్ దివి విదేహ ఎండోస్కోపి పరీక్ష ద్వారా రోగి అన్నవాహిక లోపల, బయట, కింది భాగంలోని నాళాలు ఉబ్బి రక్తస్రావం అవడాన్ని గుర్తించి అత్యాధునిక ప్లగ్ అసిస్టెడ్ రెట్రోగ్రేడ్ ట్రాన్స్ వీనస్ అబ్లిటరేషన్ (పార్టో) విధానం ద్వారా చికిత్స చేసి రక్తస్రావం జరగకుండా చేశారని వివరించారు.

ఆస్తుల కన్నా ఆరోగ్యం మిన్న

ఒంగోలు సెంట్రల్: ఆస్తుల కన్నా ఆరోగ్యం ముఖ్యమని, లేకపోతే ఎంత ధనం ఉన్నా నిష్ప్రయోజనమని ఒంగోలు డీఎస్పీ రాయపాటి శ్రీనివాసరావు అన్నారు. స్థానిక రంగారాయుడు చెరువు కట్టపై వాకర్స్ కోసం ఎన్ఆర్ఐ ఘట్టమనేని కార్తీక్ తన తండ్రి కృష్ణారావు జ్ఞాపకార్థం ఏర్పాటు చేసిన అరుగును డీఎస్పీ ప్రారంభించారు. ప్రతిరోజూ గంట పాటు వాకింగ్ చేసిన అనంతరం అరగంట పాటు వ్యాయామం చేస్తే సంపూర్ణ ఆరోగ్యంగా ఉంటారని అన్నారు. వ్యాయామం అనంతరం సేద తీరడానికి అరుగు ఎంతో ఉపయోగపడుతుందని చెప్పారు. సూర్యశ్రీ దివ్యాంగుల చారిటబుల్ ట్రస్ట్ నిర్వాహకుడు షేక్ సర్దార్ షహనాజ్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో ట్రస్ట్ గౌరవ సలహాదారుడు మండవ సుబ్బారావు, ఒంగోలు నగర అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు మారెళ్ల సుబ్బారావు, మహిళా కమిషన్ మాజీ సభ్యురాలు తమ్మిశెట్టి రమాదేవి, మేడిశెట్టి సుబ్బారావు, కిరణ్, శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

చిల్లచెట్లు, పూడిక తొలగించాలి

నాగులుప్పలపాడు: గుండ్లకమ్మ ప్రాజెక్టు పరిధిలోని కాలువల్లో జమ్ము, చిల్లచెట్లు, పూడిక తొలగించి చివరి పొలాల వరకు నీరందేలా చర్యలు తీసుకోవాలని కౌలు రైతు సంఘ నాయకులు బుధవారం స్థానిక ఎమ్మెల్యే బీఎన్ విజయ్‌కుమార్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా కౌలు రైతు సంఘ నాయకులు మాట్లాడుతూ గుండ్లకమ్మ ఎడమ కాలువ పరిధిలో సుమారు 40 వేల ఎకరాల ఆయకట్టు ఉందని, వాటికి నీరందించే కాలువలు పూడికతో నిండిపోయి చిల్లచెట్లు పెరిగి నీటి పారుదలకు ఆటంకంగా ఉన్నాయని తెలిపారు. కార్యక్రమంలో జాలా అంజయ్య, జయంత్‌బాబు, ఎన్‌కే మాబు, తూబాటి శ్రీకాంత్, పమిడి వెంకట్రావు, వెంకటేశ్వర్లు, యోనా పాల్గొన్నారు.